క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వేలేరు : జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై అజ్మీర సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బండతండా శివారు మాటుతండాకు చెందిన భూక్య బుచ్చయ్య(70) కొన్ని సంవత్సరాల నుంచి కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. కాగా ఈనెల 17వ తేదీన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఆయన భార్య బావి దగ్గరకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. 108లో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు షూ పంపిణీ

ఐనవోలు : మండలంలోని పంథిని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాత శిరీష-రమణారావు దంపతులు షూ పంపిణీ చేశారు. వారి కుమారుడు కీర్తి హేమానంద్‌దత్త పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎం, ఎంఈఓ పులి ఆనందం వారిని అభినందించారు.

పీహెచ్‌సీ సమీపంలో కొండచిలువ కలకలం



దామెర : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో శనివారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. పీహెచ్‌సీ సమీపంలో భారీ కొండచిలువ స్థానికులకు కనిపించగా భయాందోళనలకు గురైనవారు కొండచిలువను హతమార్చారు. పీహెచ్‌సీ పరిసర ప్రాంతాలతో పాటు ఎస్సీ కాలనీని ఆనుకుని ఉన్న గుట్టలో నుంచి తరుచూ విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ఒకరిపై అట్రాసిటి కేసు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన ఒకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్ శనివారం ప్రకటనలో తెలిపారు. పెద్దకోడెపాక గ్రామానికి చెందిన ఒంటేరు సారయ్య వ్యసాయం చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సవాసి రమేశ్, సారయ్య నడుమ డబ్బుల విషయంలో గొడువ జరిగినట్లు తెలిపారు. దీంతో రమేశ్ సారయ్యను కులం పేరుతో దూషిస్తూ విచక్షణరహితంగా దాడి చేసినట్లు పేర్కొన్నారు. సారయ్య ఫిర్యాదు మేరకు రమేశ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

రాయపర్తి : గణపతి నవరాత్రుల సందర్భంగా మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించొచ్చని పర్యావరణ ఉద్యమకారుడు, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు రావుల భాస్కర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సునీత, ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో భాస్కర్‌రావు మాట్లాడారు. ప్రకృతి సహజ సిద్ధమైన మట్టిని నిమజ్జనం చేయడం శ్రేష్ఠమని చెప్పారు. రసాయనిక, కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల చెరువులు, కుంటలు కలుషితమవుతాయని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే పూజించి పర్యావరణ హితానికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉప్పలయ్య, రోజారాణి, గాదె ప్రవీణ్‌రెడ్డి, దేవేందర్, వీరభద్ర శర్మ, కోల దేవేందర్, అల్లూరి సురేందర్, పీఈటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల మంజూరు పత్రాల పంపిణీ

నర్సంపేట : పట్టణంలోని పలువురికి మాజీ కౌన్సిలర్ ఓర్సు అంజలి అశోక్ శనివారం నూతన రేషన్ కార్డుల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. పట్టణంలోని 14వ వార్డులో మాజీ కౌన్సిలర్ ఎలమకంటి విజయ్‌కుమార్, 1వ డివిజన్‌లో ఇన్‌చార్జ్ లక్కర్సు రమేశ్ లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు.

'పనుల జాతర' సిగ్గుచేటు

నెక్కొండ : యూరియా అందక రైతులు ఇబ్బంది పడుతుండగా పనుల జాతర పేరుతో అధికార పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొమ్ము రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సుమారు నెల రోజులుగా రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రైతుల సమస్యలను ఎప్పుడైనా పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు.

చెరువులు, కుంటలు వెలవెల



నీళ్లులేక వెలవెలబోతున్న పీచర జంగంకుంట



నీళ్లులేకుండా ఉన్న వేలేరు-శాలపల్లి నడుమ ఉన్న చిటమటల చెరువు

- ముసురు, చిరుజల్లులతోనే సరిపెడుతున్న వరుణుడు
- వేలేరులోని నాలుగు గ్రామాల చెరువులకు గోదావరి జలాల సరఫరా
- మిగతా పది గ్రామాల చెరువులు వర్షాలపైనే ఆధారం
- నత్తనడకన సాగునీటి పైపులైను పనులు
- ఆందోళనలో అన్నదాతలు

వేలేరు : వానాకాలం సీజన్ దాటిపోతున్నప్పటికీ సరైన వర్షాలు కురవకపోవడంతో మండలంలోని చెరువులు, కుంటలు నీళ్లలేక వెలవెలబోతున్నాయి. గతేడాది ఇదే సమయానికి మండలంలోని చెరువులు, కుంటలు నిండుకుండలా కనిపించగా.. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని రోజులుగా తరుచూ ముసురు, చిరుజల్లులతోనే వరుణుడు సరిపెడుతున్నాడని, భారీ నుంచి అతిభారీ వర్షం కురవకపోవడంతో ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

14 గ్రామాల్లో 58 చెరువులు, కుంటలు

మండలంలోని 14 గ్రామాల్లో 58 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో మల్లికుదుర్ల, గుండ్లసాగర్, షోడాషపల్లి, లోక్యాతండా గ్రామాల్లోని చెరువులకు మాత్రమే పైపులైన్ ద్వారా గోదావరి జలాలు వస్తున్నాయి. మిగతా 10 గ్రామాల్లోని చెరువుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు కొద్దిపాటి నీళ్లు చేరుకున్నాయి. పీచర గ్రామంలోని పెద్ద చెరువు, జంగం కుంట, అవుసులోనికుంట, వేములకుంట, మొండి కుంట, వేలేరులోని చిటమటల చెరువు, రాయికుంట, ఇతర చిన్నచిన్న కుంటలు, మద్దెలగూడెం చెరువు, కన్నారంలోని పెద్దచెరువు, నాలుగైదు ఇతర కుంటలు, ఎర్రబెల్లిలోని జాజిరేణికుంట, ఎర్రకుంట, లోతుకుంట తదితర కుంటల్లో నీరు సరిపడాలేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురవని పక్షంలో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతూ వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు.

నెమ్మదిగా సాగుతున్న సాగునీటి పనులు

ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చే ప్రతీ రాజకీయ పార్టీ నేతలు ఆరునెలల్లో మండలానికి సాగునీరు తీసుకువస్తామని హామీలు గుప్పించి గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో స్టేషన్ ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా రూ.104 కోట్లతో 2023 ఫిబ్రవరి 27వ తేదీన సాగునీటి పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పరాజయం పాలవ్వడం.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సాగునీటి పనుల నిర్మాణానికి ఆటంకం ఏర్పడినట్లు స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. దీంతో కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యే కడియం శ్రీహరి సాగునీటి పనులు పునఃప్రారంభించి ఆరునెలల్లో పనులు పూర్తిచేసి సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వర్షాకాలం అవడం, పైపులైన్ వేసే మార్గంలో రైతులు పంటలు సాగుచేయడంతో పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం దృష్టి సారించి సాగునీటి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

వర్షాలు లేక పంటలు ఎండిపోయేలా ఉన్నాయి



సరైన వర్షాలు లేక చెరువులు, కుంటల్లో నీళ్లు లేవు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానిని రైతులంతా పంట సాగుపై దృష్టిపెట్టారు. చెరువులు, కుంటల్లోని వచ్చిన కొద్దిపాటి నీళ్లు అయిపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. యాసంగి సీజన్‌లో పంటల సాగు ప్రశ్నార్థకమే. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సంబంధిత శాఖ అధికారులు చొరవచూపి మల్లన్న గండి నుంచి వచ్చే పైపులైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి చెరువులు కుంటలు నింపాలి.

- ఆవునూరి శ్యామ్, పీచర రైతు

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ధర్మారెడ్డి

పరకాల : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మల్లక్‌పేట మాజీ సర్పంచ్ బయ్య రాజేందర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరగా శనివారం ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. 18 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయిందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పరకాల మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి సూచించారు. నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాల్లో శనివారం ఆ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాలు జరిగాయి. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో విసిగిపోయారని అన్నారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, మాజీ ఏఎంసీ చైర్ పర్సన్ కేశవరెడ్డి, నాయకులు రవియాదవ్, రాజేశ్వర్‌రావు, వంశీగౌడ్, సుధాకర్, వేణు, మాజీ సర్పంచ్‌లు రమేశ్, బలరాం, మాజీ ఎంపీటీసీలు రవీందర్, సంజీవ్, మధుకర్ పాల్గొన్నారు.

దామెర : పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము పిలుపునిచ్చారు. ఒగ్లాపూర్, దమ్మన్నపేట్‌లో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే విధంగా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. నాయకులు జాకిర్‌అలీ, శంకర్, కృపాకర్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాటలతో కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వం

- బీజేపీ భూపాలపల్లి ఇన్‌చార్జ్ కీర్తిరెడ్డి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కీర్తిరెడ్డి, నాయకులు

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతోనే కాలం వెళ్లదీస్తుందని బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల కేంద్రం నుంచి ఆత్మకూరు వెళ్లే రోడ్డుకిరువైపులా డ్రెయినేజీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో రోడ్డు వెడల్పు పనుల్లో డ్రెయినేజీని తొలగించి ఇప్పటి వరకు నిర్మించపోవడం ఎంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టర్ ద్వారా పరిష్కారం కాని భూ సమస్యలను భూ భారతి చట్టం ద్వారా పరిష్కారిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క భూ సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. మండలంలోని పలు గ్రామాల్లో కోతులు, కుక్కల బెడద ఎక్కువ ఉందని, పాఠశాలకు వెళ్లే విద్యార్థులపై, వృద్ధులపై, యువకులపై, మహిళలపై దాడిచేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు మొగిళి, ఈశ్వరయ్య, పాల్గొన్నారు.

పరిశ్రమల్లో యూరియా వాడితే చర్యలు

- పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్



ఎస్ఎస్ఆర్ డెయిరీని తనిఖీ చేస్తున్న నవీన్‌కుమార్

దామెర : పరిశ్రమల్లో యూరియా వాడుతూ దుర్వినియోగం చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని దుర్గంపేట్ సమీపంలో గల ఎస్ఎస్ఆర్ డెయిరీ ఫామ్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లోని పలు విభాగాలు క్షుణ్ణంగా పరిశీలించారు. యూరియాను పంటల ఉత్పత్తికి తప్పితే ఇతర ఉత్పత్తులకు, పరిశ్రమలకు వినియోగించొద్దని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి రాకేశ్ తదితరులు ఉన్నారు.

బీమా డబ్బులు అందజేత



నగదు అందజేస్తున్న అమరేందర్‌రెడ్డి

ఐనవోలు : మండలంలోని వనమాలకనపర్తి గ్రామానికి చెందిన రిపిక వంశీ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అయితే మృతుడు శ్రీవెంకటేశ్వర పురుషుల పొదుపు సంఘంలో సాధారణ బీమా కలిగి ఉన్నాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులైన నామినీకి ఆ సమితి, సంఘం అధ్యక్షుడు బిల్లా అమరేందర్‌రెడ్డి, దూసరి కుమార్, శనివారం రూ. 80 వేల బీమా డబ్బును అందించారు. పాలక వర్గ సభ్యులు రవితేజ, రమేశ్, బాబు, రవి, రంజిత్, దేవేందర్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చొరవతో యువకుడికి కృత్రిమ కాళ్లు



మంత్రి సురేఖకు పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న రాహుల్, కుటుంబ సభ్యులు

దామెర : రైలు ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకున్న యువకుడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో కృత్రిమ కాళ్లు అమర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. హనుమకొండ జిల్లా దామెర మండలంలోని పులుకుర్తికి చెందిన గుండేటి ఉమామహేశ్ కుమారుడు రాహుల్ గతేడాది ఐఐటీ పరీక్ష రాసేందుకు రాజస్థాన్ కోటకు రైలులో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రైలులో నుంచి కిందపడగా రెండు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. దీంతో తండ్రి ఉమామహేశ్ కుమారుడి చికిత్స కోసం మూడు లక్షల వరకు ఖర్చు చేసినా ఫలితం లేకపోగా రాహుల్ రెండు కాళ్లను వైద్యులు తొలగించారు. ఈ నేపథ్యంలో తన కుమారుడిని ఆదుకోవాలని ఉమామహేశ్ మంత్రి కొండా సురేఖ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వేడుకున్నాడు. దీంతో రూ.10 లక్షల విలువచేసే కృత్రిమ కాళ్లను అమెరికా నుంచి తెప్పించిన నిమ్స్ వైద్యులు రాహుల్‌కు అమర్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి కొండా సురేఖకు ఉమామహేశ్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి పోరాడిన 'సురవరం'



ఎల్కతుర్తి : సురవరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : పేదలు, కార్మికులు, కర్షకుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ కొనియాడారు. శనివారం ఎల్కతుర్తి బస్టాండ్ కూడలి, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని అంబేడ్కర్ కూడలి వద్ద సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుధాకర్‌రెడ్డి ఏఐఎస్ఎఫ్ సభ్యుడి నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగారని గుర్తుచేశారు. నిత్యం పేద ప్రజలు, కార్మికులు, కర్షకుల సంక్షేమానికి పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు రాజ్‌కుమార్, రమేశ్, మొండయ్య, ప్రకాశ్, రాజయ్య, శ్రీనివాస్, భిక్షపతి, తిరుపతి, చంద్రయ్య, అజయ్, సుకుర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చుక్కయ్య, లింగయ్యలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భోజన కార్మికులకు చీరల పంపిణీ



నడికూడ : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న 41 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం చీరలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ విమల, ట్రస్ట్ నిర్వాహకుడు, విశ్రాంతి ఉపాధ్యాయుడు గంగిశెట్టి జగదీశ్వర్ ఎంఈఓ హనుమంతరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కమలాపూర్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అరుణ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కానిపర్తి, శంభునిపల్లి గ్రామాల్లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వర పీడితులకు డెంగీ, మలేరియా, ఆర్‌బీఎస్, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం లావణ్య, హెల్త్ అసిస్టెంట్ రాము, ఆశ కార్యకర్తలు రజిత, కోమల, రాణి, కావ్య, సంధ్యతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జాతర



ఇరుముడితో గుట్టపైకి వెళ్తున్న మాలధారులు



స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం రత్నగిరి గుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి జాతర శనివారం వైభవోపేతంగా జరిగింది. స్వామివారి దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. దీంతో గుట్ట పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో రత్నగిరి వద్ద పండుగ వాతావరణం నెలకొంది. వంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యురాలు డాక్టర్ రుబీనా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు.

మార్మోగిన వీరభద్ర నామస్మరణ

భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామికి 27రోజుల నక్షత్ర దీక్ష మాల విరమణ కార్యక్రమంలో శనివారం జరిగింది. అందులో భాగంగా మాలధారులు వీరభద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి కోడెను కట్టి, పంచామృత రుద్రాభిషేకం నిర్వహించి పుష్పార్చన చేశారు. అనంతరం మాల విరమణలో భాగంగా ఇరుముడితో నక్షత్ర దీక్ష స్వాములు కాలినడకన వీరభద్రుడి నామస్మరణ చేస్తూ గుట్టపైకి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం మాల విరమణ చేశారు. ఆలయ ఈఓ కిషన్‌రావు, గురుస్వామి, రాంబాబు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

శాయంపేట : ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో అన్ని వివరాలతో అనుమతి పొందాలని ఎస్సై జక్కుల పరమేశ్ సూచించారు. మండపాల్లో విద్యుత్ కనెక్షన్‌కు డీడీ తీయాలని, విద్యుత్ అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటు కారణంగా రోడ్డు బ్లాక్ కాకుండా చూడాలని పేర్కొన్నారు.

నేడు కొప్పులలో వైద్యశిబిరం

శాయంపేట : వినికిడి సమస్య ఉన్న వారికి మండలంలోని కొప్పుల గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు. గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు.

చిన్నారులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు


కమలాపూర్ : విద్యార్థులు చిన్నవయస్సు నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించాలని శ్రీసత్యసాయి సేవా సమితి నిర్వాహకులు సూచించారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా శత వర్ష వేడుకలను మండలంలోని మర్రిపల్లిగూడెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మామిడి, నిమ్మ, ఉసిరి తదితర 50 రకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ నిర్వాహకులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



దామెర : మండలంలోని ఒగ్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వర్షం నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు దోమల నివారణకు బయోటిక్స్ పిచికారీ చేశారు. రోడ్లకిరువైపులా పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నరేశ్ మాట్లాడుతూ.. దోమలు వ్యాప్తిచెంది వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు చెప్పారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దామెర : మండలంలోని ఒగ్లాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్ కుమార్ తెలిపారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ పోటీల్లో పాఠశాలకు చెందిన గణేశ్, సాయికుమార్, వరుణ్‌కుమార్, తరుణ్, విద్యాకర్, అరవింద్, చరణ్, శివ, రవి, భానుప్రసాద్, డేవిడ్, కమాలకర్ వివిధ విభాగాల్లో పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్‌తో పాటు ఏటీపీ సృజన, స్వేత, పీఈటీలు శ్రీకాంత్, శ్రీనాథ్ విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

శాయంపేట : ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు విద్యార్థులు కష్టపడాలని వైద్యుడు ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో శనివారం మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యార్థులు వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయికృష్ణ, సోషల్ వర్కర్ నరేశ్, సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ రజని పాల్గొన్నారు.